
# జాబ్ శాటిస్‌ఫాక్షన్



## అవధానుల విజయలక్ష్మి

తలుపులన్నీ మూసి ఉన్న ఆ ఎయిర్ కండిషన్డ్ గది చల్లగా ఉంది. నాలుగు ట్యూబ్‌లైట్లతో వెలుగ్గానూ ఉంది. పొడలు కవిపిస్తున్న పెద్ద టేబిల్ ముందు కూర్చొని మేనేజర్‌గారు ఒక్కొక్క కాగితం తిరిగేస్తుంటే పక్కనే నిల్చొని ఆత్రుతగా ఆయన మొహం లోకి చూడసాగాను. అంతా పూర్తయ్యేసరికి ఆయన పెదవుల మీదికి చిరునవ్వు తోసుకొచ్చింది.

"వెరీగుడ్ సుధా! యూ హేవ్ డన్ ఎ గుడ్ జాబ్" అన్నారు పక్కనే నిల్చుని నా భుజం మీద ఆప్యాయంగా తడుతూ.

తలుపులు మూసిఉన్న గదిలోకి నిశ్శబ్దంగా జరిగి పోయిన ఆ పనిని గది బయట పెద్ద హాలులో పనిచేస్తున్న అరవై మందిలో ఒక్కరూ చూడలేదు!

అందులో ఒక్కరు చూసినా వాళ్ళ కళ్ళలోఎంత జెలసీ కనపడుతుందో తెలుసు. వాళ్ళ పెదిమల మీదికి ఎంతవం కర నవ్వు వస్తుందో తెలుసు. కళ్ళలోని ఆ జెలసీని చూడలేక పోయినందుకు విచారమూ, వంకర నవ్వులూ చూడ్డం తప్పిపోయినందుకు సంతోషమూ ఒక్కసారే కలిగాయి.

"నాలుగు రోజుల్నుంచి ఆ ఆఫీసర్లు నలుగురూ ఈ ప్రోబ్లం గురించి బుర్రబద్దలు కొట్టుకున్నారు. ఇంతకూ ఇది నీ నోటీస్‌లో కెలా వచ్చింది?"

"మొన్న వాళ్ళు కూర్చొని డిస్కస్ చేసుకొంటుంటే విన్నాను సార్. ఫిగర్స్ మనస్సులోనే నోట్ చేసుకొన్నాను".

"వెరీగుడ్! కన్‌సర్న్‌డ్ ఆఫీసర్లకే పట్టని విషయం నువ్వింత శ్రద్ధ ఇంటికి కూడా తీసికెళ్ళి సాల్వ్‌చేశావంటే... రియల్లీ ఐ అప్రిషియేట్ యూ! అన్నట్లు నీది ఎమ్మే ఎకనామిక్స్ కదూ!"

"ఎస్‌సర్".

"మరి ఓ.ఆర్ టెక్నిక్‌లో ఎలా సాల్వ్ చెయ్యగలిగావు దీన్ని?"

"నేను చదువుతున్న కాస్టింగ్‌లో ఉంది సార్".

ఆయన మరోసారి ఆప్యాయంగా నా చెయ్యి నొక్కి వదిలేశారు.

"బైదవే. నువ్వెళ్ళేటప్పుడు ఆ రంగనాథాన్ని ఓసారి రమ్మన్నానని చెప్పు"

"అలాగేసార్" బయటకు నడిచాను.

టేబిల్ మీద కాగితాలు పరిచి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రంగనాథం. బహుశః ఏ పార్టీ దగ్గర ఎంత డబ్బు గుంజుదామని కాబోలు.

నిశ్శబ్దంగా నడిచి వచ్చి అతని పక్కన నిల్చొన్న నన్ను చూసి ఉలిక్కి పడ్డాడు.

నవ్వుకొన్నాడు.

వీళ్ళందరూ నన్ను చూసి ఎందుకిలా భయపడతారు?

నా చదువు చూశా? నా పర్సనాలిటీ చూశా? నా సిన్సియారిటీ చూశా? మేనేజర్ గారితో నా సన్నిహితత్వం చూశా?

ఆఖరిదే నిజమని నాకు తెలుసు. అదే లేని రోజు వీళ్ళంతా నన్ను ఎంత చులకనగా చూస్తారో తెలుసు.

"మేనేజర్ గారు మిమ్మల్ని రమ్మంటున్నారు" చెప్పేసి ముందుకు కదిలాను.

**అది కేవలం లక్ కాదని నీకూ తెలుసు అతని వైపు సూటిగా చూస్తూ అన్నాను. అతని పెదవుల మీద పేలవ మైన చిరునవ్వు కదలాడింది. "అవును. కేవలం అదృష్టం కాదు. నీకు ధయిర్యముంది. చొరవుంది. అందుకే...**

అతను చురచురా చూస్తున్న చూపులు వెనకనించి నా వీపుని గుచ్చుకొంటూనే ఉన్నాయి.

అంచవర్లో పిలుపొచ్చింది. ఎవరో విజిటర్స్ వచ్చారని. విజిటర్స్ రూము వైపు నడిచాను.

అత్తయ్య కొడుకు రవి!

"హాయ్ బావా!" అన్నానతని వైపు నడుస్తూ.

"హాయ్ సుధా" అన్నాడు నా వైపు అభిమానంగా చూస్తూ.

"ఎప్పుడొచ్చావీ ఊరు?"

"పొద్దున్నే ట్రెయిన్ దిగాను. మళ్ళా సాయంత్రం వెళ్ళిపోవాలి. అందుకే తిన్నగా ఆఫీస్ కొచ్చేశాను!"

"ఎలా ఉంది మా ఆఫీసు?" చిలిపిగా చూస్తూ అడిగాను.

"బ్రహ్మాండంగా ఉంది! జీతమెంతిస్తారు?" చెప్పాను.

ఆశ్చర్యంతో అతని కళ్ళు వెడల్పయాయి.

"నేను ప్రైవేట్ స్కూల్లో టీచరుగా చేస్తూ ఇందులో సగం కూడా సంపాదించలేకపోతున్నా" విచారంగా అన్నాడు.

"మరేమనుకొన్నావ్? ఈ రాష్ట్రంలోని గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌లోకెల్లా ఇదే పెద్దది!" గర్వంగా అన్నాను.

నిట్టూర్చాడు అతను, తర్వాత నా వైపు తిరిగి అన్నాడు.

"ఈ డ్రెస్ నీకు బాగా నప్పింది. రియల్లీ యూ ఆర్ లుకింగ్ ఫైన్!"

"థాంక్స్" చిరునవ్వు నవ్వాను.

అంతలోనే అతని ముఖ కవళికలు మారిపోయాయి.

"నీ డ్రెస్ గురించి కామెంట్ చేసినందుకు కోపం రాలేదు కదా?" అపాలజిటిక్‌గా అడిగాడు.

"నో! నాటెటాల్! ఈ డ్రెస్‌ని చూసుకొని నేనెప్పుడూ గర్వపడుతుంటాను!" చిరునవ్వుతో అన్నాను నా డ్రెస్‌వైపు ఆప్యాయంగా చూసుకొంటూ.

"యూ ఆర్ లక్కీ! మంచి జీతమిచ్చే ఉద్యోగం సంపాదించుకొన్నావు!" అన్నాడు నా వైపు మెచ్చికోలుగా చూస్తూ.

"అది కేవలం లక్ కాదని నీకూ తెలుసు" అతని వైపు సూటిగా చూస్తూ అన్నాను. అతని పెదవుల మీద పేలవ మైన చిరునవ్వు కదలాడింది.

"అవును కేవలం అదృష్టం కాదు. నీకు ధయిర్యముంది. చొరవుంది. అందుకే హాయిగా ఈ ఉద్యోగం చేసుకో గలుగుతున్నావ్".

నేను నవ్వాను.

"బైది వే. ఉద్యోగం ఎలా ఉంది?"

"మా మేనేజర్ గారికి నేనంటే బోల్డు అభిమానం. ఏ ప్రోబ్లెం అయినా చిటికెలో సాల్వ్ చేసేస్తానని అందుకే అన్ని సెక్షన్ల ప్రోబ్లెమ్స్ నాతో చర్చిస్తూ ఉంటారు"

"నమ్మమంటావ్! అందులోనూ ఇటువంటి గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్‌లో!" ఆశ్చర్యంగా అన్నాడు.

"నమ్మకపోతే నీ కర్మ! ఆయన లాంటి బాస్‌లు చాలా అరుదుగా ఉంటారు!

అందుకే స్టాఫ్‌లోని అరవై మందీ నన్ను చూసి



అసూయ పడుతూ ఉంటారు''

ఫక్కున నవ్వాడతను. నవ్వుతూనే నా భుజం మీద తన భుజంతో పొడిచాడు.

''నే వెళ్తామరి! సాయంత్రం వీలైతే స్టేషన్‌లో కలు!''

''ఓకే!''

బయటకు నడిచాడతను.

నేను ఆఫీసు హాల్లోకి అడుగుపెట్టేసరికి మేనేజరు గారి దగ్గర్నుండి పిలుపు సిద్ధంగా ఉంది.

ఆయన రూంలోకి నడిచాను.

''పొద్దున్న నువ్వు సాల్వ్ చేసి ఇచ్చిన ప్రాబ్లెంని ఆ ఇద్దరు ఆఫీసర్లతో డిస్కస్ చేశాను! ఇదే కరెక్ట్ సొల్యూషనని వాళ్ళూ ఒప్పుకొన్నారు!''

చాలా హాయిగా అనిపించింది నాకు. ఎమ్మే చదివిన నాకు ఇంతకంటే ఎక్కువగా జాబ్ సేటిస్‌ఫేక్షన్ ఎక్కడ దొరుకుతుంది?






**సలహా**

"కాళ్ళల్లో ముళ్ళుగుచ్చుకుంటున్నట్లు కలలొస్తున్నాయిరా" బాధను చెప్పుకున్నాడు గోపీ.

"ఇవాళ్నుంచి పడుకోబోయేముందు బూట్లేసుకుని పడుకోరా" సలహాయిచ్చాడు ఫ్రెండ్.

—సిరిసిల్లా రశీద్ శిక్షక్
(జంగంపల్లి)

అంతలోనే చిన్నశంక.

"ఈ ప్రోబ్లెంని నేను సాల్వ్ చేశానని వాళ్ళతో చెప్పలేదు కదా సార్!" జంకుతూ అడిగాను.

"నో! చెప్పలేదులే! చెప్తే మాత్రం ఏం నష్టం? నేను ఈ గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌లో ఉండీ నిస్సహాయుడినై పోయాను. కానీ లేకపోతే మరో ఏడాదిలో నేను నిన్నే నా సీట్లో కూర్చో పెట్టే వాడిని!"

'థాంక్యూ సార్, ఫర్ యువర్ కైండ్‌నెస్, నేను ఇంతసేపూ బాధపడుతున్నా అనవసరంగా ఇంకొకరి పనిలో నేను దూరిపోయానేమోనని!"

"నో... నో... దూరిపోవడమన్న ప్రశ్నేలేదు. ఎవరీ స్థానంలో ఉన్నా ఒక సమస్య వచ్చిందంటే అది అందరిదీనూ. నీకు సామర్థ్యం ఉంది నువ్వు చేశావు. వాళ్ళకి నిర్లక్ష్యం ఉంది వాళ్ళు మానేశారు".

"నేనింక వెళ్ళవచ్చునా సార్!"

"ఓకే. అన్నట్లు నీ కాస్టింగ్ చదువు ఎంత వరకొచ్చింది?"

"మొదటి పార్టు అయిపోతోంది సార్".

"వెరీగుడ్! పార్ట్ టూ కూడా ఇలాగే త్వరత్వరగా పూర్తిచేస్తేనే మరో అయిదేళ్ళలో ఆ స్థానానికి చేరుకొంటావ్. కొన్ని డిగ్రీలున్నా, ఎన్ని తెలివితేటలున్నా ఉద్యోగపు పైమెట్లు చేరుకోడానికి కావలసినవి టెక్నికల్ క్వాలిఫికేషన్లే! ఎనీహౌ, బెస్ట్ ఆఫ్ లక్!"

"థాంక్యూ సార్!" అన్నాను మేనేజర్ గారి టేబుల్ మీదనున్న ఫైళ్ళను చంకలో ఇరికించుకొని బయటకు నడుస్తూ.

గది తలుపు దాటే ముందు నాకు అమితమైన జాబ్‌సాటిస్‌ఫాక్షన్ అందజేస్తూ తెల్లటి నా డ్రస్సుకి తగిలించి ఉన్న ఇత్తడి బిళ్ళను ఆప్యాయంగా తడుముకొన్నాను. "నాలాగే నా లాంటి అందరికీ కూడా ఆ బిళ్ళ ఆత్మన్యూనతా భావాన్ని కాకుండా ఆత్మ విశ్వాసాన్ని ఇస్తే ఎంత బాగుంటుంది!" అనుకొన్నాను.

'డి.సుధాకర్ అటెండర్' అన్న బిళ్ళమీది అక్షరాలు చల్లగా నా చేతికి తగిలాయి. *